# నమ్మలేని పచ్చి సత్యాలు

## భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారి అద్భుత లీలలు



కాపీల కొరకు వ్రాయండి

శ్రీ సాయిమాస్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి
నెల్లూరు జిల్లా - 524 321



## మానవాళికి శ్రీ స్వామి వారి చివరి సందేశం

సంపన్నత్వం,
సాధారణత్వం,
సత్యం, ధర్మం,
సద్గురు సేవ.

మహాసమాధి అయ్యేందుకు ముందు కొన్ని నెలల పర్యంతం రాత్రి, పగలూ వరుసగా తాను పెద్దగా పై మాటలు అరుస్తూ ఆ మాటలను తన సేవకులను పెద్దగా అరవమనేవారు. వారు నిద్రవల్ల అరవకుంటే ఏమయ్యా చెప్పవూ? అని అడిగేవారు. ఇది ప్రపంచ మానవులందరికీ భగవదాదేశము మరియు సర్వశాస్త్రాలసారము అని శ్రీ స్వామివారు తన చివరి సందేశం ఇచ్చారు.

## హుండీలో వందరూపాయల క్రొత్త నోట్లు యాభై ఉండడం

ఇప్పుడు ఆఫీసు, స్టోర్సు ఉండే భవనం శ్రీ స్వామివారే కట్టించారు. మూడువంతుల ఖర్చు ప్రభుత్వం, ఒకవంతు శ్రీ స్వామివారి సంస్థ భరిస్తే కమ్యూనిటీహాల్ నిర్మించే పథకము క్రింద ప్రభుత్వం కొన్ని కమ్ములు, కొంత సిమెంటు ఇచ్చారు. ఆ తెల్లవారే ఆ పథకం తీసేసినట్లు ఆర్డర్లు వచ్చాయి. పునాదులు త్రవ్వి ఆపకూడదని చిన్నగా అప్పులు తెచ్చి పని సాగిస్తున్నారు. ఆ రోజుల్లో హుండీలో రోజుకు ఒక వందరూపాయలొస్తే గొప్పమొత్తమనుకునే వాళ్ళము. ప్రతి రెండు రోజులకు హుండీ తీసి సిమెంటు, ఇటుక వారికి కొద్ది కొద్దిగా ఇస్తున్నాము. తులసమ్మ కుమారుడు నారాయణరెడ్డిగారు ట్రెజరర్. వారి పాలసీ ప్రకారం ఎవరైనా భక్తులు వారికై వారే ఇస్తే తప్ప మనం వారిని అడగకూడదు.

పదిహేనురోజుల నుండి బేలుదారి వారి బట్వాడా ఇవ్వడం లేదు. రెండు రోజులు ఇక్కడ పని ఆపితే మరొకచోట పనిచేసి కనీసం ఒక వంద రూపాయలు చిల్లరంగడి వాండ్లకిస్తే మరలా అప్పిస్తారు గనుక రేపటి నుండి రెండు రోజులు పని నిలపమంటారు బేలుదార్లు. పని నిలిపితే వెంటనే మీరు రాలేరు ఎల్లుండి హుండీ తీసి ఎంత ఉంటే అంతా మీకే ఇస్తానని రెడ్డిగారు చెప్పి వారిని ఆపారు. ఎల్లుండి మధ్యాహ్నం మూడు గంటలకే హుండీ తీశారు. నమ్మలేని విధంగా యాభై కొత్త వందరూపాయల నోట్లు మడుపులు ఉన్నాయి. చెప్పినట్లుగానే బేలుదారి మేస్త్రిని పిలచి ఐదువేల రూపాయలు వారికే ఇచ్చారు. మన ఇబ్బంది గమనించి శ్రీ స్వామి వారే అంత మొత్తం హుండీలో ఉంచారా లేక ఎవరినైనా ప్రేరేపించి వేయించారా అనేది శ్రీ స్వామి వారికే ఎరుక.

## అన్నం అక్షయం కావడం

1983 వ సంవత్సరంలో ఇప్పటివలె హుండీలో డబ్బురావడం లేదు. ఒక్కొక్కరోజు ఒక్కొక్క గ్రామం నుండి అకస్మాత్తుగా పదిమంది శ్రీ స్వామివారిని సేవించిన భక్తులొస్తారు. అదీ భోజన కాలంలో కాకుండా అకాలంలో వస్తారు. మధ్యాహ్నం రెండుగంటలకొస్తే వారికి వండి పెట్టాలి. మన దగ్గర మిగిలింది ఒక మనిషికి సరిపడా భోజనముంది. తలా ఒక ముద్ద పెడితే ప్రసాదంగా తింటారు వండినాక భోజనం పెట్టవచ్చని పెట్టసాగితే ఈ ఒక్క మనిషన్నమే వచ్చిన వాళ్ళందరికీ సరిపోయేది. ఈ రహస్యం నరసమ్మ, చెంచమ్మలకు తెలుసు. ఇది ఎవ్వరికీ చెప్పవద్దని చెప్పారు. మన అవసరాన్ని బట్టి వారే సర్వం సమకూరుస్తున్నారు. బియ్యం ఉండి, వండే మనుషులు, కట్టెలు, కాలము ఉండి కూడా ఇలాంటి లీల జరగాలంటే జరుగదు. వండకుండా ఉండడం మన



సోమరితనానికి గుర్తు. ఈ వంట డిపార్ట్‌మెంటు వారిలో ఎలాంటి అహంకారం తలెత్తినా తగువిధంగా తప్పక శిక్షించేవారు.

## కట్టెలు లేకుంటే కట్టెలు తెప్పించడం

శ్రీ స్వామివారి అగ్ని గుండానికి శ్రీ స్వామి వారి మహాసమాధి అనంతరం కూడా మల్లిక వెంకయ్య కట్టెలు కొట్టి బండిలో తోలుకవచ్చి సమర్పిస్తున్న రోజులవి. పదిరోజులు ఏదో గ్రామం వెళ్ళి వెంకయ్య రానందున గుండమునకు కట్టెలు అయిపోయి సన్నసన్నని కట్టెలతో నిప్పు ఆరకుండా చేస్తున్నారు. వెంకయ్య తిరిగి వచ్చి నేను లేకుంటే గుండం చూడండి ఎట్లా చేశారో, నేనుండి కట్టెలు తెస్తుంటే ఏమీ తెలిసేది కాదు అని చేతులు తిప్పుతూ అభినయంగా మాట్లాడాడు. "వెంకయ్యా! నీవట్లా మాట్లాడకూడదు. నా జీతం పదివేల రూపాయలు. నన్నొక కుక్క పిల్లవలె తనచెంత కట్టేసుకున్నారు. వారు కావాలంటే ఎవ్వరూ తోలకరాకుండానే కట్టెలు లారీలు లారీలు తెప్పిస్తారు. నీవట్లాటి ఆలోచనలే రానీయ కూడదు" అన్నాను. ఆయన కాస్త మూతిముడుచుకొని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రెండు గంటలకు ఒక ట్రాక్టరునిండా బాగా ఎండి, వేళ్ళలోని మట్టంతా వానకు కొట్టుకొనిపోయిన కర్రతుమ్మ మొదళ్ళు తెచ్చి గుండం దగ్గర దించి వెళ్ళారు. వాళ్ళెవరోగానీ వాళ్ళను తెమ్మని ఎవరూ చెప్పలేదట. చాలాకాలంగా శ్రీ స్వామి వారికి ఆ మొద్దు లివ్వాలనుకొని ఈ రోజుకు తెచ్చామని చెప్పారు. నేను వెంకయ్యను పిలచి ఇప్పుడేమంటావని అడిగితే చెంపలేసుకున్నాడు. మనవల్లనే జరుగుతుందనే భావం వస్తే అది దాతకు ఇటు శ్రీ స్వామి సేవకులకూ ఇరు పక్షాలకూ అపరాధం అంటుకుంటుంది.

# బియ్యం లేకుంటే బియ్యం తెప్పించడం

ఒకప్పుడు రైతులు మొక్కుబడులకిచ్చిన వడ్లు ఆశ్రమంలో ఉన్నాయి. కానీ వాటిని మిల్లు ఆడించే మనిషిలేడు. బుజ్జయ్యగారు ఎక్కడికో వెళ్ళి పదిరోజులు రాలేదు. ఆశ్రమంలో వాళ్ళు తినకుండా నయినా వచ్చిన అతిధులకు అన్నం పెట్టాలి గనుక బియ్యం లేనందున ఊరంతా బదుళ్ళు తెచ్చారు. ఇక బియ్యమిచ్చే ఇల్లే లేదు. చివరకు నన్ను పట్టుకున్నారు. అదీ ముందుగా కాక తీరా సైకిలెక్కేటప్పుడు. ఆరోజులలో నేను నిత్యం ఉద్యోగం చేసి సాయంకాలానికి గొలగమూడి వస్తున్నాను. ఇక్కడి అంగడివాళ్లతో నాకు పరిచయం లేదు. నా దగ్గర డబ్బులేదు. సాయంకాలం డబ్బు ఇస్తానని పదిసేర్లు బియ్యం అప్పు ఇప్పించాను. బ్యాంకులోనుండి డబ్బు తెచ్చేమాట మరచిపోయాను. పాపం ఆ అంగటివారు మూడురోజులు అప్పిచ్చారు. నాలుగవరోజు అంగడిలో బియ్యం అయిపోయాయి. నెల్లూరునుంచి తెస్తే ఇస్తానన్నాడు. ఒకపూట పస్తయినా ఉండడం తప్ప వేరే మార్గం లేదు.

సర్వసాక్షి, సర్వసమర్థుడైన శ్రీ స్వామి వారు తన బిడ్డలను పస్తుపెడతారా? మధ్యాహ్నం మూడు గంటలకు ఎవరో ఒకభక్తుడు A క్లాసు బియ్యం ఒక బస్తా (70 kg), నూనె డబ్బా, నువ్వులనూనె, 5 kg చక్కెర, కందిపప్పు, ఆవాలు జీలకర్ర, చింతపండు, మిరపకాయలు, యర్రగడ్డలు, కూరగాయలు సర్వం కారులో తెచ్చి ఆశ్రమమునిండా పెట్టేశారు. బదుళ్ళు తెచ్చుకున్న బియ్యమన్నీ తిరిగి ఇచ్చేశారు.

ఈ విధంగా నిజంగా అవసరమైన సమయానికి సర్వం తెప్పించినది శ్రీ స్వామి వారా? లేక ఆ తెచ్చిన దాతా? శ్రీ స్వామి వారికి దానం చేశానని గర్విస్తే శ్రీ సాయి సన్నిధి అనే గ్రంథంలో కాశీరాంషింపీ (86 వ పేజి) కి జరిగినట్లు జరుగుతుందని గ్రహించాలి. కాశీరాంషింపీ నేను బాబాకు డబ్బిస్తున్నానని గర్విస్తాడు. ఒక్క సంవత్సరంలోపల బికారవుతాడు. బాబా పాదాల మీద పడి ఏడుస్తాడు. ఏమైంది? నా పాలన పోషణ నీవే చూస్తున్నావు గదా! అని వ్యంగంగా మాట్లాడుతారు బాబా. నిజమైన పశ్చాత్తాపం చెందాక ఆశీర్వదిస్తారు. తిరిగి భాగ్యవంతుడౌతాడు.



# లారీతో రంపకోతమొద్దులు రావడం

ఒకసారి శ్రీ స్వామివారి ట్రాక్టరు మీద పని చేసే కూలీలంతా జీతాలు పెంచాలని స్ట్రైక్ చేసారు. ఇంతకుముందు రోజుకు మూడు ట్రాక్టర్ల కంపతెచ్చే వాళ్ళు ఇప్పుడు ఒక ట్రాక్టరే తోలుతున్నారు. పూర్వం ఎండిన కంప పొయ్యిలో పెట్టేవారు, ఇప్పుడు పచ్చి కంప పెట్టవలసివస్తు న్నది. పొయ్యిమండక అన్నం వండలేక, వండే అతను తిట్టుకుంటూ ఉన్నాడు. అదే సమయంలో అక్కడ వంటవండడం చూడాలని ఒకరు వెళ్ళి అతని బాధేమిటో తెలుసుకొని రిసీవర్ దగ్గరకెళ్ళి మాట్లాడాడు. లారీ బాడుగ మీరు భరిస్తే ఎండిన రంపకోత మొద్దులు పంపుతానన్నాడు. అలాగే పంపమన్నారు. మరురోజుకు లారీతో వచ్చి దిగాయి ఎండు మొద్దులు. ఆ విధంగా మొద్దులు తెప్పించింది శ్రీ స్వామివారే కదా. అట్లాకాక నావల్లనే అన్నదానం జరుగుతుందని గర్విస్తే ఎలా ఉంటుందో యోచించండి

నేడు వంటకు నీటి ఆవిరి వాడుతున్నారు. పొయ్యిలు మండలేదనే బాధేలేదు. ఇందులో ఎవరైనా నావల్లనే ఈ కార్యం జరుగుతుందని మనసులో తలచారంటే కాశీరాంషింపీ కి జరిగిన మర్యాద తప్పదని గ్రహించాలి.

ఒకప్పుడు మా ఇంట్లో పదిరోజులకు సరిపడే బియ్యాన్ని నెలరోజులకు వచ్చేటట్లు చేసిన కరుణామయుడు శ్రీ స్వామివారు. కట్టెలు లేక తాటాకులు, ముండ్ల కంపలతో వండుతుంటే ఎండు కట్టెల బండి మావాకిట ముందు నిలిపిన దయానిధి వారు. ఇందులో మన గొప్పదనముందని అహంకరిస్తే నాగతీ కాశీరాంషింపీ లాగే తప్పక అవుతుంది.

## శ్రీమాన్ బూటీగారి చివరి సలహా

శ్రీమాన్ బూటీగారు తన ఆస్థి ఎంత ఉందో తనకు తెలియని నాగపూర్ కోటీశ్వరుడు. వీరు పన్నెండు సంవత్సరాలు షిరిడీలో ఏ వసతులూ లేని పాత పెంకుటిళ్ళలో ఉంటూ శ్రీ సాయిని సేవించిన ధన్యజీవి. 1918 వ సంవత్సరంలోనే రెండు లక్షల ఖర్చుతో తన నివాసానికని నిర్మించిన బూటీవాడాను శ్రీ సాయి సమాధిమందిరం చేసిన పుణ్యాత్ముడు. వీరు పరమపదించేటప్పుడు తనవారందరికీ ఇచ్చిన చివరి సందేశం మనందరము తెలిసికొనియుండడమెంతో మంచిది. ఈ విషయం చెప్పినవారు 'ఆచార్య భరద్వాజ' గారు.

"ఎప్పుడైనా మీరు షిరిడీ సంస్థానం వారు ఇచ్చే ప్రత్యేక మర్యాదలను అంగీకరిస్తే ఆనాడే మీ పతన మారంభమైనదని గుర్తించండి"

ఈ సలహామేరకే ఆ వంశస్తులీనాటికీ దర్శనానికి రావాలంటే ఎంత కష్టపడియైనా, శ్రమ అనుకోకుండా క్యూలో అందరితోపాటు అతి



సామాన్యంగా వస్తారు. డబ్బిచ్చి రూము తీసుకుంటారు తప్ప మేము బూటీ వంశీయులమని మచ్చుకైనా తెలియనీయరు.

శ్రీ ఎక్కిరాల వేదవ్యాస్ గారు ఆంధ్రప్రభుత్వ డైరెక్టర్ అయికూడా మూడు మార్లు శ్రీ స్వామి వారి దర్శనానికి వస్తే అందరితో క్యూలోనే వచ్చారు తప్ప తన పదవిని ఉపయోగించి ప్రత్యేక దర్శనం పొందలేదు. ఇక మనమేవిధంగా ఉండాలో మనమే యోచించుకోవాలి.

## శ్రీ స్వామి వారి మందిర నిర్మాణము తన సొంత ఖర్చుతో చేసిన శ్రీ నారాయణరెడ్డి గారు

శ్రీ నారాయణరెడ్డి గారు (మాతాజీ తులసమ్మ కుమారుడు) ఎలా ప్రవర్తించారో మనందరికీ ఆదర్శము. వారు పరమపదించేంత వరకు ఏనాడుకానీ తన బంధు మిత్రులను, కలెక్టరు, డిప్యూటీ కలెక్టర్లు, మినిస్టర్లు మొదలైన ఆఫీసర్లనెవ్వరినీ స్పెషల్ దర్శనానికి తీసుకొని పోలేదు. తానేనాడూ క్యూలోరాకుండా అడ్డం వచ్చి దర్శనం చేసుకున్నదిలేదు. కలెక్టరులాంటి వారు వస్తే కూడా ప్రత్యేక దర్శనం లేదు. డఫేదారు మాకు దర్శనమిప్పిస్తే వెళ్ళిపోతామని వీరి చెవిలో చిన్నగా అడిగితే ఆయనతో సరే, సరే అని చిన్నగా కలెక్టరు దగ్గరకు జరిగి "మీకు కావాలంటే స్పెషల్ దర్శనమిప్పిస్తాను. కానీ మీరు వచ్చిన శ్రమకు, ఖర్చుకు స్పెషల్ దర్శనానికి సరిపోతుంది. ఇక మీకేమీ మిగలదు. ఒక అరగంట ఆగితే నేనేమీతో క్యూలో వచ్చి దర్శనం చేసుకుంటాను" అనేవారు. వెంటనే కలెక్టరు "ఇప్పుడు తొందరేముంది, అలాగేపోదాం" అనేవారు.

వారి హయాంలో ప్రెసిడెంటుగారు పదికుర్చీలు తెప్పించారు. అవి ఆఫీసులో వేస్తే నేను వెంటనే రాజీనామా చేస్తానని చెప్పారు శ్రీ రెడ్డి గారు.

పదకొండవ వ్యక్తి వస్తే వారెక్కడ కూర్చోవాలి. గనుక అందరికీ ఒకే ఆసనం చాపలే వేయించారు. 1980 వ సంవత్సరంలో లక్షరూపాయలంటే ఈ రోజు ఏడు లక్షల రూపాయలు. అంత కైంకర్యము చేసిన ఆ మహనీయుడే అలా ఉంటే మనమెలా ఉండాలో ఆలోచించుకోవాలి.

పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజ గారు విద్యానగర్ శ్రీ సాయి మందిరం ప్రారంభోత్సవానికి పూజ్య స్వామీజీ శ్రీ కేశవయ్యగారిని తీసుక వచ్చారని ఎందరెందరో గొప్పవాళ్ళు వచ్చారు. కానీ ఎవ్వరికీ స్పెషల్ దర్శనం లేదు. ఆనాటి శ్రీ సాయిమందిర పాలకవర్గం శ్రీ భరద్వాజ గార్పై కినుక వహించారు. ఆలిండియా సాయి సమ్మేళనానికి వారిని ఆహ్వానించలేదు. కానీ బెంగుళూరు నుండి వచ్చిన వ్యక్తి వెళ్ళి శ్రీ భరద్వాజ గారిని కారులో తీసుకవచ్చి ఆ పాలకవర్గం వారిచేతనే స్టేజిమీదకు ఆహ్వానించి ఉపన్యసించమన్నారు.

ఈ శ్రీ భరద్వాజ గారు నేటికి సమాధై పధ్నాలుగు సంవత్సరాలైతే గూడా నేటికీ అనేకమందికి భౌతిక దర్శనాలిస్తూ వారి కష్టాలు తీరుస్తున్న మహనీయుడు. ఇలాంటి మహనీయుల ఆచరణే మనకు మార్గదర్శకం కానీ తిరుపతి దేవాలయం కాదు. తిరుపతిలో జరిగే యజ్ఞం ద్వారా నలభై రోజులలో వచ్చే ఫలితం గొలగమూడి యజ్ఞంలో నాలుగు గంటలలో వస్తుందన్నారు శ్రీ స్వామి వారు. అది యదార్ధమేనని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. గనుక ఏ మందిరం లో నైనా ఈ స్పెషల్ దర్శనాలు కోరడంగానీ, అలా అమాయకులై కోరిన వారికి తెలియ జెప్పవలసినదిపోయి స్పెషల్ మర్యాదలు చేయడమెంత నీచనీయమో యోచించండి.



శ్రీమాన్ బూటీ గారి అంతిమ సలహాను మనమందరం సదా గుర్తించుకొందుము గాక!

మేము శ్రీ వెంకయ్య స్వామిని నమ్ముకున్నాము ఆ కారుణ్యమూర్తి మమ్ములను ఏన్నో ఆపదల నుండి రక్షించారు. 2003 సం|| లో వచ్చిన గోదావరి పుష్కరములకు మా అమ్మగారు, నాన్న గారు మా బంధువులతో కలిసి వెళ్ళుటకు, నిశ్చయించు కొన్నారు. ప్రయాణమునకు పోవలిసిన రోజున నేనే మా అమ్మ గారి బ్యాగ్, బట్టలు మరియు ఇతర వస్తువులు సర్దితిని. ఆప్పుడు సమయము 10 గంటలు, అంతవరుకు బాగానే వున్న నాకు వున్నట్లుండి మోషన్స్, వాంతులు మొదలు పెట్టినవి. చాలా ఎక్కువగా ఆయ్యి నాకు సెలైను కట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. నాకు ఇంటి లోనే సెలైను కట్టించారు. అంతలో మా బంధువులు బస్టాండుకు రమ్మని ఫోను చేసినారు. నా పరిస్థితి గురించి విని, అయితే మీరు తరువాత రండి మేము వెళుతాం అని చెప్పినారు. కాని నేను మాత్రము మా అమ్మ గారినీ, నాన్న గారి నీ వెళ్ళమని వత్తిడి చేసాను. ఎందుకంటే సెలైను కట్టిన తరువాత నాకు బాగానే వున్నది. కానీ మా అమ్మగారు మాత్రం స్వామి వద్దని చెపుతున్నారు లేకుంటే ఇప్పటి వరకు బాగానే వున్న నీకు వున్నట్లుండి ఇలా కావడ మేమీటి? స్వామి వద్దన్నారు కనుక వెళ్ళము అన్నారు.

అంతటితో పుష్కర యాత్ర నావలన ఆగిపోయింది అని బాధపడినాను. వారం రోజుల తరవాత మాకు తెలిసిన వార్త ఏమిటంటే పుష్కరములకు వెళ్ళిన మాబంధువుల ఆటో బోల్తా పడి వాళ్ళకు బాగా దెబ్బలు తగిలాయి. ఒకరికి చెయ్యి కూడా విరిగినది. వాళ్ళు హాస్పిటల్‌లో ఉన్నారు అని తెలిసింది. అదే మా అమ్మ, నాన్న కూడా వుండి వుంటే వాళ్ళకు కూడా అలాగే అయి వుండేది. కరెక్టుగా బయలు

దేరవలసిన టైంలో నాకు అప్పుడే అలా అవడం, తరువాత బాగానే వుండటం స్వామి లీల కాదంటారా?

సి.హెచ్. శ్రీదేవి, పొండిలి,16-12-03.

నా పేరు అమృత, ఊరు గార్ల, ఖమ్మం జిల్లా. మా నాన్న గారి పేరు వెంకటేశ్వర రావు, ఊరిలో వ్యవసాయం చేసుకుంటూ వుంటారు. మా తల్లిదండ్రులకు ఇద్దరం సంతానం. అన్నయ్య, నేను. నాకు 1999 లో తీవ్రంగా జ్వరం వచ్చి, రక్తం తగ్గి పోయింది. మనిషిని అంతా పాలిపోయి నట్లు తెల్లగా అయి పోయాను. డాక్టర్లు అన్ని పరీక్షలు చేసి ఇక్కడ తగ్గదు, వెంటనే హైదారాబాదుకు తీసుకు వెళ్ళి పెద్ద హాస్పిటల్‌లో చూపించండి అన్నారు. మా వాళ్ళు చేసేది ఏమిలేక వెంటనే హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ అన్ని పరీక్షలు చేసి లుకేమియా అని నిర్ధారించారు. డాక్టర్లు ట్రీట్‌మెంటు మొదలుపెట్టి, ప్రాణానికి హామి ఇవ్వలేము అని చెప్పినారు. మా తల్లిదండ్రులు ఎంతో డబ్బు ఖర్చు పెట్టినా జబ్బు నయము కాలేదు. దేవుని మీద భారము వెయ్యమని డాక్టరు చెప్పినారు. అలాంటి సమయంలో మా పెద్దనాన్నగారు, డాక్టరు శేషగిరిగారు, అంతకూ ముందు 4 సం|| సౌదికి వెళ్ళి నేను హాస్పిటల్‌లో ఉన్న సమయంలో ఇండియాకి వచ్చారు. రాగానే పరిస్థతి చూచి నాకూ గొలగమూడి వెంకయ్య స్వామి చరిత్ర ఇచ్చి, దాన్ని పారాయణ చెయ్యమని దారం కట్టమని, ప్రతిరోజు విభూతి పెట్టమని చెప్పి, ప్రతిరోజు నేను బెడ్ మీద పడుకొంటే విభూది పెట్టి, దారం చేతికి కట్టి , లెక్కలేనన్ని సార్లు స్వామి చరిత్ర పారాయణను నాకు వినిపించమన్నారు. మా అమ్మ, నాయనమ్మ వీలైనన్ని సార్లు చదివి నాకు వినిపించేవారు. మా పెద్దనాన్న ఇంట్లో , మా అత్తయ్య ఇంట్లో మరియు మా మేనత్త ఇంట్లో అఖండ జ్యోతిని వెలిగించినారు. నా గురించి మా వాళ్ళంతా స్వామిని ప్రార్ధించినారు. ఇలాంటి సమయంలో నాకు ట్రీట్‌మెంట్ మొదలు



అయ్యినది. ఆ మందులు వలన ఇన్ఫెక్షను వచ్చినది. డాక్టర్లు బ్రతికే సూచన లేదు, ఆశ వదులుకొమన్నారు. మా వాళ్ళంతా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని దు:ఖంలో మునిగి వున్నారు. ఒక్కరోజు మధ్యాహ్నాము సుమారు 12 గంటల సమయంలో ఒక ముసలాయన వచ్చి నా బెడ్ మీద కూర్చుని ఏమమ్మ ఎందుకు ఏడ్చుచున్నావు! నీకు నేను వున్నానుగా, నేను బాగు చేస్తాను, మరి నాకు ఏమి యిస్తావు అని అడిగినారు. అంతకు ముందు స్వామి చరిత్ర వినటం వలన మీకు 150 ప్రదక్షణాలు చేస్తాను నాకు తగ్గితే అని అన్నాను. వెంటనే తనవద్ద నున్న తంబురతో నా కాళ్ళ మీద రెండు దెబ్బలు వేసి నీకు తగ్గింది అని ఆశ్వీరదించినారు. అప్పటి నుండి నాకు నయం అయ్యింది. మరల రక్త పరీక్ష చేయ్యిస్తే ఎలాంటి ప్రాబ్లం లేదు అని అన్నారు. జబ్బు పూర్తిగా నయం అయ్యినది. ఇలా ఒక్కసారి ట్రీట్‌మెంట్ కే ఇంత మంచిగా నయం అయ్యి రక్తము మంచిగా వచ్చింది. ఈవిధంగా మంచిగా రావటం అంతా దైవకృప కాక మరి ఇంక ఏమిటి?

నాకు నయం అయ్యిన వెంటనే, గొలగమూడికి వెళ్ళి స్వామి సమాధి మందిరమునకు 150, 108 సార్లు ప్రదక్షణలు చేసినాను. మరల ప్రతి 5 సం|| లకొక్కసారి స్వామిని దర్శించుకొంటున్నాను.

-మాటేటి అమృత

శ్రీ శేషాద్రి గారు విద్యానగర్ సాయి మందిరం ట్రెజరర్ ఇలా వ్రాస్తున్నారు.

ఒకరోజు శ్రీ స్వామి వారి సన్నిధికి గొలగమూడి వచ్చాను, అక్కడ కూర్చోగానే దివ్యమైన ధ్యానాన్ని ప్రసాదించారు. ఎంతో ప్రశాంతతను అనుభవించాను. ఆ శాంతి అనుభవించ వలనే కాని వ్రాయనలవికాదు. కన్నులు తెరచి శ్రీ స్వామికి ఇలా విన్నవించాను. స్వామి! "మీ కృపకు

చెప్పాంగా ఏదైనా ప్రసాదంగా ప్రసాదించండి. తమరు అలా ప్రసాదించక పోయినా నేనేమీ బాదపడను" అని అనుకొని కూర్చున్నాను. పూజారి వచ్చి ఒక భోజన టిక్కెట్టు చేతిలో పెట్టి భోంచేయమన్నారు. అతను మందిరం తెరవేసి తిరిగి నా దగ్గరికి వచ్చి ఒక రోజాపువ్వు నాచేతిలో వేసి వెళ్ళారు. నావినయ పూర్వక ప్రార్ధనను అలా తీర్చారు. మందిరం బయటకు వస్తుంటే **"కష్టం ఎంత అనుభవిస్తే అంత మంచిది కదయ్యా"** అన్న శ్రీ స్వామి వారి మాట పైనా మనసు పెట్టి - ఆ మాటనే మననం చేస్తూ పోతున్నాను. నా మెటారు సైకిల్ ఆయిల్ ట్యాంకు నిండా పెట్రోలు ఉంది అని అనుకొన్నాను. కాని అర పర్లాంగు పోగానే బండి ఆగి పోయింది, ట్యాంకులో పెట్రోలు ఒక చుక్క కూడా లేదు. వెనక్కు వచ్చి సుబ్బరామయ్య గారింట్లో బండి పెట్టి రేపు ఆయిల్ తీసుకొని వచ్చి బండి తీసుకొని పోవచ్చుకదా అనే ఆలోచన వచ్చింది. వెంటనే **"కష్టం ఎంత అనుభవిస్తే అంత మంచిది గదయ్యా "** అన్న శ్రీ స్వామివారి మాటలు గుర్తుకు రాసాగింది. కష్ట పడడటమే మంచిది అని బండి నడిపించు కొని ముందుకే పోతున్నాను. రాత్రి 11గం|| టైం లో ఏమీ జంకకుండా ముందుకే నడుస్తున్నాను. నాలుగు కిలోమీటర్లు పోయాక కొండాయపాళెం మద్యలో పోతున్నాను. ఒకతను మెటారు సైకిల్ మీద పది బారలు వెళ్ళి తిరిగి వెనక్కు వచ్చి ఏమి సారు బండి ఉండి నడుస్తున్నారు అన్నారు. ఆయిల్ లేదండీ అన్నాను. టైం రాత్రి 1 గంట కావచ్చింది. డబ్బా వుందేమో అని నన్నే కాక సమీపం లో నిద్రిస్తున్న వారిని నిద్రలేపి అడిగినా దొరకలేదు. అతడు మరొకరిని బాగా శబ్దం చేసి లేపి డబ్బా తెచ్చి మిరెక్కడకు పోవాలి, ఈ పెట్రోల్ తో పెట్రోలు ట్యాంకు వరకు వెళ్ళ వచ్చు, అంటూ కొంత ఆయిల్ పోశాడు.

శ్రీ స్వామి వారు ఎంత కరుణామయులో చూడండి! **" నొప్పి ఎంత అనుభవిస్తే అంత మంచిదనే"** వాక్యం పై నా మనస్సు కేంద్రీ



కరింప జేయడం, వెనుకకు తిరగకుండా ముందుకే నడిపించి, శ్రీ స్వామి వారిపై ఏ మాత్రం కష్ట పడకుండా పోతుంటే - నేను అడగకుండా నే నన్ను దాటి వెళ్ళిన వ్యక్తి తిరిగి వెనక్కు వచ్చి రాత్రి 1గం|| ప్రాంతంలో పెట్రోలు ఇవ్వటం అంటే లోతుగా యోచిస్తే తెలుస్తుంది. వారి కరుణ ఎంత గొప్పదో!

వారి మాట పై లక్ష్యముంచి సాగితే ఎంతగా ఆదుకుంటారో! వారి స్థితి ఎలాంటిదై ఉండాలి? కేవల చైతన్యమే గదా! నిర్గుణం, నిర్మలం, నిత్యం నిర్వికల్పం, నిరంజనం అయిన ఆ చైతన్యమే మానవుల పై కరుణతో మానవ రూపం దాల్చి సద్గురువుగా ఉంటూ రెండు స్దితుల లోనూ ఉండగల మహనీయుడన్న మాట.

శ్రీ మాష్టారు గారు చెప్పినట్లు గడపలో నిల్చున్న మనిషి లాంటి వారు, బయట లోపలా రెండు చోట్ల ఏమున్నదో చూడగలవారు. మనమంతా అట్లా బయట లోపల ఏదో ఒకచోట మాత్రమే ఉంటాము. వారెంత గొప్ప సద్గురువు కానిదే అందరి హృదయాలను ప్రేరేపించగల స్థితిలో ఉండలేరు. **"వాళ్ళూండే దాన్ని బట్టయ్యా మన ముండేది"** అన్న శ్రీ స్వామి వారి మాట అక్షర సత్యమే గదా!

శ్రీ సాయి మందిర సేవకుని అనుగ్రహిస్తున్నారంటే అంతరంగికంగా ఆ మహనీయులంతా ఒక్కటే అన్న శ్రీ మాష్టారి మాట పరమ సత్యమని తెలుస్తుంది.

# శ్రీ వెంకయ్య స్వామి వారి అమరబోధలు

## "చూచి నేర్చుకోండయ్యా"

మాకేదైనా బోధించమన్న వారితో - "చూచి నేర్చుకోండయ్యా" అన్నారు. నోటితోగాక తన ఆచరణ ద్వారా అనంతకోటి సత్యాలు బోధించారు శ్రీ స్వామి. వారు విశ్వవ్యాపకులని, సర్వసాక్షియని, సర్వకర్మ ఫలప్రదాతయని వారిని చూచి మనం నేర్చుకోవాలి.

వారి జీవితకాలమంతా ఇతర జీవులకొరకే జీవించారు. ఘోరమైన నియమపాలన సాగించారు. ఈ నియమపాలన ఎందుకు చేశారు? మానవజాతిని ఉద్ధరించేందుకు, సర్వలోక సంరక్షణార్ధము కఠోర నియమపాలన చేశారు. తాటిఆకు రేక లేదని మూడు రోజులు గంజి త్రాగలేదు. ఎంతటి ప్రాణాపాయమైన తుఫానువచ్చినా చూరుక్రింద వదుక్కున్నారు. వళ్ళంతా బురదపడి, వర్షానికి తడుస్తున్నా వణుకుతూ చూరుక్రింద వదుక్కున్నారు గాని గృహస్తుల ఇంట్లోకిపోలేదు. వారి కఠోర నియమపాలన చూచి మనలను నేర్చుకోమన్నారు. మనకు పనికిరాని మురికినీరు త్రాగిన చెట్లు కమ్మని మధురఫలాలనిస్తున్నాయి. మానవుడు భగవంతుడిచ్చిన సర్వం తిని ఇతర జీవులకేమి చేస్తున్నాడో యోచించుకోమన్నారు. ఏమీ చేయకుంటే ఆయా రూపాలలో ఉండి మన ఆహారం తయారుచేసిన భగవంతునకు బాకీ పడతామని హెచ్చరిస్తున్నారు.

ఒకవేళ వ్యవసాయం, మొదలైన వృత్తులు చేసినా స్వార్ధపూరిత చింతనేగాని, ఇది భగవంతుని సేవ అనేభావముందా? “యద్‌భావం తత్‌భవతి" అన్నారు. మన భావమెట్లుంటుందో ఫలితమలాగే



ఉంటుందన్నారు పెద్దలు. గట్టి పుణ్యం, మీడియం పుణ్యం, అతిస్వల్ప పుణ్యం అని మూడు రకాల పుణ్యం ఆర్జిస్తామన్నమాట.

మన అజ్ఞానం వలన మేలుచేయడం పోయి, ఇతర ప్రాణులకు కీడుచేస్తున్నాము. నడివీధిలో అరటితొక్కలు వేయడం, అందరూ నడిచే త్రోవలో మురికినీరు వదలడం, తీరిక సమయాలలో ఇతరులను విమర్శిస్తూ వారి పాపం మనం తీసుకొని మన పుణ్యం వారికిస్తున్నాము. భగవంతుడు నిజంగా మననుండి కోరే మన మనస్సు, కాలము వారికి సమర్పిస్తున్నామా? రోజులోని 24 గంటల కాలములో నిద్ర 8 గంటలు, మిగిలిన 16 గంటల కాలమూ పొట్టకూటి సంపాదనా కార్యక్రమం మరియు ఊసుబోని కబుర్లు. నిత్యం ఒకటి రెండు గంటల కాలంగానీ ఇంకా ఎక్కువగానీ వారి చింతనకు సమర్పిస్తారేమోనని మన ఆచరణ కొరకు ఎదురు చూస్తున్నారు. ఆచరణ ద్వారా కాలము, మనస్సు వారికి సమర్పిస్తే అనంతమైన విలువగల అనుభవాలిస్తున్నారు. అలా అనుభవం పొందిన వారిని చూచైనా నేర్చుకోమంటున్నారు. జీవితకాలమంతా ఇతర జీవులనుద్ధరించేందుకు సర్వలోక సంరక్షణకే పాటుపడ్డారు. స్వార్ధచింతన మాని ఇతర జీవులలోని భగవంతునకు కొంతసేవ చేయండి అంటున్నారు. చూచి నేర్చుకోమన్న మాటలో ఎంత సాధారణత్వముందో చూడండి. నన్ను చూచి నేర్చుకోమనడంలేదు, అది వారి గొప్పతనం. ఎంతటి మహా అద్భుతమైన దివ్యలీలలు చేసికూడా ఆవగింజంత తనమీద పెట్టుకోకుండా అంతా భగవంతుని లీల అన్నారు. ఏటిలోని నీరు ఎదురు పారించినా, కఠినశిలను వెన్నగా మార్చినా, ఆకు ఆకుకూ ఒక్కరోజు వ్యవధిలో పూతాపిందెలు సృష్టించినా అంతా దైవలీలే అన్నారు. భిక్షకు వెళ్ళి తలగీరుకుంటూ నిలబడి ఏంపిచ్చెంకన్నా వచ్చావు అంటే నోటికి చేతికి సైగచేసి అంత ముద్ద పెట్టమని సైగ చేసిన సాధారణత్వమది. నాకు ముద్ద పెట్టావు గనుక నిన్నాశీర్వదిస్తానని చేయి ఎత్తలేదు. సాధారణ భిక్షకుని

వలె తన టవల్‌లో ఆ సంగతి ముద్ద వేయించుకొని వెళ్ళారు. తనసేవకుడైన చలమానాయునికి సేద్యపుపనులు చేసిన సాధారణత్వమది. ఆ చలమానాయుని ఐదేళ్ళ కుమారుడు మరణిస్తే తన భుజాన మోసుకొని వెళ్ళి పెన్నానదిలో పూడ్చివచ్చారేగానీ నేనింతగొప్పవాణ్ణి శవాన్ని మోస్తానా అనే గర్వం ఏ కోశానా లేని సాధారణత్వమది. సాధారణ భిక్షకునివలె "తల్లీ" అని పిలిచారు. ఎవరదీ అన్న ఆ గృహిణితో " పిచ్చోణ్ణమ్మా" అన్నారేగానీ నేను వెంకయ్యస్వామిని అని చెప్పలేదు. అది వారి దివ్యసాధారణత్వం. దాన్ని చూచి నేర్చుకోమంటున్నారు. స్వాములని మనం భ్రమించేవారంతా శ్రీ స్వామి వారి సాధారణత్వం చూచి నేర్చుకుంటే ఎంత గొప్పవారవుతారో గదా!

శ్రీ స్వామి వారు సద్గురు సేవ ఎలాచేశారో కొంతైనా తెలుసుకుంటే నాకు కాస్త జ్ఞానమొస్తుంది. ఈ విశ్వమంతా వారికి గురు రూపంగానే ఉండేది. ఏనాడైనా ఎవరినైనా "ఓరే" అని ఏక వచన ప్రయోగంతో పిలిచి ఎరుగరు. ప్రతివారిని "అయ్యా" అని ఎంతో గౌరవంగా పిలిచేవారు. చిన్న పిల్లలనైనా అంతే. అందరూ వారికి గురు రూపంగానే కన్పించేవారు.

## వసద్ది చేసుకుంటే రెండక్షరాలు చాలయ్యా అన్నారు

వసద్ది చేసుకోవడమంటే నైతిక విలువలు మనలో పెంపొందించు కోవడం. దీనినే శ్రీ స్వామి వారు సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ అని బోధించారు. దీనినే పూజ్యశ్రీ భరద్వాజగారు నైతికవిలువలు విస్తర లాంటివి, ఆధ్యాత్మికత అన్నంలాంటి వన్నారు. విస్తర లేకుండా అన్నం తినలేము గదా. ఈ నైతిక విలువలు మనలో సహజసిద్ధం కాకుండానే మంత్రోపదేశాలు, ధ్యానాలు అభ్యసించడాలు గజస్నానం లాంటివని బోధించారు. మొదట సద్గురువు



విశ్వరూపుడని, ఏ జీవిని ఆదరించినా, అన్యాయం చేసినా అది సద్గురువుకే చెందుతుందనే విశ్వాసపూర్వకమైన ఆచరణ రావాలి. అప్పుడు ఏ మంత్రమైనా సిద్ధి పొందుతుంది. నైతిక విలువలు లేకుండా పోవడానికి కారణం ఆశ. ఆశకు మూలకారణం అజ్ఞానం. ఏ జీవి ఏమి తినాలో, ఏమి అనుభవించాలో మనం పుట్టకముందే నిర్ణయించబడి, ఆ ప్రాప్తమంతా ఆ జీవి తలవ్రాతగా తనతో ఈ భూమిమీదకు తెచ్చుకుంటుంది. అంతకు మించి ఆశతో ఆర్జించినా అవి ఇనపెట్టెలలోను, బ్యాంకులలోను స్థిరాస్తుల రూపంలో మగ్గవలసిందేగానీ ఈ జీవి ఏది అనుభవించాలో అంతకుమించి అనుభవించలేడనే సంపూర్ణ విశ్వాస ముంటే మానవ జన్మ సాఫల్యం చేసుకొని తీరుతుంది. ఆశ చచ్చేందుకు ఈ ఎరుక ఎప్పుడూ ఉండాలంటారు పెద్దలు. అప్పుడు ఆశలేని నాడు సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవ సాధ్యమవు తుందని శ్రీ స్వామి వారు ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా అని సెలవిచ్చారు. సద్గురుడు విశ్వరూపుడని అన్ని జీవులలో వెంకయ్య ఉన్నారనే హృదయపూర్వక విశ్వాసంతో ఏ ప్రాణికి ఇబ్బంది కలిగించకుండా జీవితయాత్ర సాగించడము, పరోపకార బుద్ధితో నిష్కామకర్మ చేసుకుంటూపోతే సద్గురుడే మనలను దగ్గరకు తీసుకుంటారు. మనలెక్కలో పాపంకంటే పుణ్యమెక్కువ ఉంటే తప్పక సద్గురువుకు దగ్గరౌతాము. సద్గురువును చేరిన తర్వాత మానవ సహజమైన బలహీనతలు, దుర్గుణాలు మనలో ప్రవేశించకుండా చూచుకోవాలని శ్రీ స్వామివారు మాల, మాదిగ, జోగి, జంగం చేరకుండా చూచుకోండి. అందరికి పంట పండించాను దొంగలుపడి దోచుకోకుండా చూచుకోండి అని శెలవిచ్చారు. సద్గురుని సూచనప్రాయమైన హెచ్చరికలు ఖాతరు చేయకుండా మొరటుగా ప్రవర్తిస్తుంటే పదే పదే చెప్పి చెప్పి, హెచ్చరించి హెచ్చరించి పోయ్యేవాళ్ళను పోనిచ్చేదేగదయ్యా అంటారు. గనుక ఆశ, ఇంద్రియలోలత మొదలైన

దొంగలకు మనలో తావులేకుండా చూచుకుంటుండడం ఎంతో ముఖ్యమని తెల్పారు.

## ఎక్కడైనా ఒంటి దూలం ఇల్లు వేసుకొని ఉండయ్యా

సాధన చేసుకుంటూ ఏ గ్రామములోనుండమంటారు స్వామీ? అన్న భక్తునితో పైమాట చెప్పారు. ఇంటికి ఆధారం దూలం కనుక మన జీవితానికి ఆధారం ఒక్క భగవంతుడే అనే ఎరుకతోఎక్కడున్నా పరవాలేదు. సాధారణ మానవులేగాక సాధకులమని భ్రమించే వారందరూ బంధు మిత్రుల వత్తిళ్ళకు మొహమాటములకు లొంగి వారు పాటించే నియమాలను ధర్మాలను సడలించుకోవడం సహజం. ఒక్కొక్కప్పుడు పరిస్థితులకు లొంగి నియమాలు, ధర్మాలు తప్పడం ఉంటుంది. అట్టివారు కఠోరనియమపాలన చేయలేరు. నియమ పాలనకాదు కఠోర నియమపాలన ఉండనిదే భగవంతుని కృప కల్గదని బోధిస్తున్నారు. భగవంతుడే, మనమంచికే, ఈ పరిస్థితులు కల్పించారని హృదయపూర్వకంగా విశ్వసించి భగవంతుడే దిక్కని సర్వస్యశరణాగతి చేసి కఠోర నియమపాలన, ధర్మపాలన లేనిదే సాధనలో ఫలితముండదని, మన శక్తినంతా ఉపయోగించి కృషిచేయనిదే ఫలితముండదని వాచాబోధించడమేగాక తన ఆచరణ ద్వారా బోధించారు. ఉదాహరణకు తాటి ఆకురేక లేకుండా మూడురోజులైనా గంజి త్రాగకుండా ఉన్నారు. ఎంతటి వర్షములోనైనా గృహస్తుల ఇండ్లలోకి పోకుండా శరీరమంతా బురదచుట్టుకొని తడిసి వణుకుచున్నా ప్రాణానికెంత బాధ కల్గినా ప్రాణం పై ఆశ వదలి భగవన్నిర్ణయానికే వదిలారుగాని నియమపాలన, ధర్మ నిష్టను వదలలేదు. ఆ విధంగా భగవంతుని పైన మాత్రమే దృష్టి ఉండాలిగాని మన ప్రాణాలమీద కాదు దృష్టి ఉండాల్సింది అని బోధిస్తున్నారు. శ్రీ భరద్వాజ మాష్టరుగారు



జీవించిన విధానము వారి తండ్రిగారైన అనంతాచారిగారు జీవించిన విధానము ఉదాహరణగా తీసుకోవాలి. భగవంతునిపై అనంత విశ్వాసములేనిదే "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" చేయలేమని బోధిస్తున్నారు.

## వాళ్ళుండేదాన్ని బట్టయ్యా మనముండేది

ఏమి స్వామి కొందరికి తేళ్ళు, పాములు కరచినప్పుడు మిమ్ము స్మరించిన వెంటనే బాధ నివారణవుతుంది? మరికొందరికి మీ విభూతి తిన్నాక, పూసినాక బాధ నివారణవుతుంది. మరికొందరికి మీ సన్నిధికి వచ్చి గుడ్డతో మంత్రించాక, విభూతి సేవించాక కొంతసేపు బాధ భరించాక నివారణవుతుంది అని అడిగిన భక్తులతో శ్రీ స్వామి వారు పైమాట అన్నారు. ఆ మాట వారి మహాసమాధి అనంతరం నేటికి కూడా సత్యమే. మన భక్తి, శ్రద్దలు, విశ్వాసాన్ని బట్టి వారి కృప మనపై ఫలితం చూపిస్తుందని భావం. ఒకే అయస్కాంతం తుప్పుపట్టిన ఇనుముపై ఒక మోతాదులో ప్రభావం చూపుతుంది, ఇనుముపై తుప్పుగానీ, దుమ్ము, రంగు వంటి మలినాలే లేకుంటే మరికొంత ఎక్కువ మోతాదులో ప్రభావం చూపుతుంది. అలాగే వారికృప అందరిపైన సమానంగా ఉండినా మన శ్రద్ధ, భక్తి, విశ్వాసాలననుసరించి వారి కృప మనపై పనిచేస్తుంది. అందరి శ్రద్ధ, భక్తి, విశ్వాసాలు ఒకటిగా ఉండవు కదా.

ప్రతినిత్యము ఒకే సమయంలో కొంత కాలము, మన మనస్సును వారికి ఇస్తామని చెప్పుకొని ఇస్తూవచ్చాము. ఒకరోజు ఫారిన్ నుండి కూతురు అల్లుడు దిగారు, లేక మరొకగ్రామం నుండి మనింటికి వచ్చారు. ఆ సంబరంలో శ్రీ స్వామి వారికి మనస్సు, కాలము ఇచ్చేమాట టైం దాటి పోతుంది. కొందరికి అసలు గుర్తేరాదు. శ్రీ స్వామికి చెప్పుకున్నమాట

తప్పిపోయారన్నమాట. అసత్యవాదులయ్యారు. మనకు తీరినప్పుడు వారి పూజ, పారాయణ, స్మరణ చేస్తాము. కానీ మనం పిలిచీ పిలవకముందే శ్రీ స్వామి వారు మనలను ఆదుకోవాలని కోరడం ఎంత అధర్మమో గదా. కోటానుకోట్ల జీవులను సంరక్షించాలి గనుక నేను కూడా నాకు తీర్చికైనప్పుడు నీ పనిచూస్తానంటారు శ్రీ స్వామివారు. అదే పై మాటల అర్ధమని గ్రహించి ఆపద సమయంలో మనకు అండవారేనని బాగా ఎరిగి ఉండమంటున్నారు. పిలవకముందే కొందరిని ఆదుకుంటున్నారు. అదే స్వామి వారితో మనకుగల భక్తిబంధానికి నిజమైన గుర్తు. స్మృతిరహిత ప్రసన్నాయ నమ: అనే గ్రంధమంతా ఈ సత్యానికి నిదర్శనమే.

## పంట చేను వదలి పరిగేరుకుంటావా

సద్గురుని స్థితి ఏమిటో వారెంతటి సమర్ధులో ఎలా సేవించాలో చాలా చక్కగా ఎరిగి సేవించుకుంటున్న రోశిరెడ్డి అనే శిష్యుడు వృద్ధాప్యం వల్ల ఏ పనీ చేయలేడు. క్రొత్తవారొచ్చి శ్రీ స్వామివారి పాదాలు తాకి నమస్కరించుకుంటారు. అది శ్రీ స్వామివారు అంగీకరించరు. గనుక స్వామి వారు తనను ఎవ్వరూ తాక కుండా రోశిరెడ్డి గారిని కావలి పెట్టు కున్నారు. ఆ చిన్న సేవను ఎంతో ధర్మబద్ధంగా దీక్షతో నెరవేరుస్తున్నారు రోశిరెడ్డిగారు. ఎవరి వత్తిళ్ళకుగానీ, మొహమాటాలకూగానీ లొంగడు. గనుక అతనిని చూస్తే ఇతర సేవకులకు కోపం. కోపమెందుకు? ఎవ్వరినీ తాకనివ్వడే అని బాధ. గురువాజ్ఞయే వారికి లెక్కగానీ ఈ సాటిసేవకుల మాటలు కాదు. అందుచే ఆ సేవకులొకరోజు రోశిరెడ్డి వినేటట్లుగా "ఈ ముసలాడు పనీపాటలేకుండా బాగా తిని కూర్చొని ఎవ్వరినీ వాలనివ్వడు" అని అన్నారు. అది విన్న రోశిరెడ్డి - ఛీ! ఈ పాడు గుడ్డి బ్రతుకుకంటే అంత విషం తిని చావడంమేలని లేచిపోతున్నాడు. శ్రీ స్వామి వారాయనను రోశిరెడ్డి అని పిలచారు. ఆయన వెనక్కొచ్చికూర్చున్నాడు.



ఇద్దరి మధ్య ఇక సంభాషణే లేదు. మంచి అర్ధరాత్రి సమయంలో అందరూ నిద్రపోయేటప్పుడు రోశిరెడ్డి గారితో "పంట చేను వదలిపెట్టి పరిగేరుకుంటావా? ఊర్లో అన్ని నూకలు భిక్షతెచ్చుకొని గంజికాచుకొని త్రాగి ఇక్కడ ఉండకూడదా" అన్నారు. వారి మాట ప్రకారం చివరివరకు గ్రామంలో భిక్షతెచ్చాడు. కళ్ళు కనపడని రోజులలో కుడా భిక్షకెళ్ళే సమయమైతే కొద్దిగా చూపు వస్తుందట. భిక్షకు వెళ్ళి ఆశ్రమం చేరగానే మరలా చూపుపోతుందట.

శ్రీ స్వామి వారి సన్నిధిలో సాధన చేయడం పంట చేలోని ఫలితం అనుభవించడంలాంటిదని, పరిగ ఏరుకోవడమంటే - పంటంతా రైతు తీసుకపోయాక అక్కడక్కడా పడి ఉండే ధాన్యపు వెన్నులు ఏరుకోవడం లాంటిదే శ్రీవారి సన్నిధి వదలి ఎక్కడో సాధన చేయడం అని శ్రీ స్వామి వారి మాటకర్ధం. ఈమాటే శ్రీ భరద్వాజ మాష్టరుగారు ఇలా చెప్పారు "ఇంట్లో పూజ పారాయణ, స్మరణవంటి సాధనలు చేస్తే పది పైసల ఫలితమొస్తుంది. అదే సాధనలు ఆ గ్రామంలోని దేవాలయంలో చేస్తే ఒక్కరూపాయి ఫలితమొస్తుంది. కాశీ, శ్రీ శైలం, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలలో చేస్తే వంద రూపాయల ఫలితమొస్తుంది. అదే సాధనలు సద్గురు సన్నిధులైన షిరిడీ, గొలగమూడి వంటిచోట్ల చేస్తే ఫలితం అనంతంగా వస్తుందని చెప్పారు.

## దారం తెగిపోకుండా ఉంటే టెలిఫోను తీగలులాగినట్లు ఉంటుంది. ఎప్పుడూ నేను మీతోనే ఉంటాను.

మీరెప్పుడూ తిరుగుతుంటారు. మరలా మీదర్శనభాగ్యం ఎప్పుడుకల్గునో స్వామీ అన్న భక్తులతో శ్రీ స్వామివారు పైమాట అన్నారు. దారం తెగిపోకుండా ఉండడమంటే చేతికి కట్టుకున్న దారమనికాదు

అర్థం. మానసికమైన సంబంధం శ్రీ స్వామి వారితో కల్గియుండడమని అర్థం. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోమన్నారుగదా. ఏ జీవిని ఆదరించినా, చీదరించినా అది శ్రీ స్వామి వారికే చెందుతుందని నిరంతరం ఏమరుపాటు లేకుండా గుర్తుపెట్టుకోమంటున్నారు. త్వమేవమాతాచ పితాత్వమేవ అన్న శ్లోకంలో చెప్పినది నిత్యం పూజలో చదివితే చాలదు. దాన్ని ఆచరణలో పెట్టమంటున్నారు. తనవారినే గాక బయట ప్రతిమానవుని మరియు ప్రతిజీవిని శ్రీ స్వామి వారి చైతన్యమే అనే భావం పోకుండా సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వంతో సద్గురుని సేవిస్తూ ఉంటే సద్గురుకృప కల్గుతుంది. వారికి మనమెంత దూరానఉన్నా దగ్గరవారమే అవుతాము అంటున్నారు.

జీవులేకాదు, నిర్జీవులుకూడా నేనేనని చెప్పారు. శ్రీ రామయ్య అనేభక్తుడు పుల్ల నిమ్మకాయ నైవేద్యం పెట్టినప్పుడు ఇచ్చిన అనుభవం అదే. గోవు పంచితం శ్రీవారి చిత్ర పటం మీద పడ్డప్పుడు శ్రీ రామయ్య పంచితం తుడవక వదిలేసినప్పుడు వారికిచ్చిన అనుభవమదే. ఈ భక్తునకు బావి త్రవ్వుచుంటే కఠిన శిలపడ్డప్పుడు ఇచ్చిన అనుభవం కూడా అదే. సర్వనిర్జీవులూ నేనేనని చెప్పారు. ఏటిలో మునిగిపోయే భక్తుని కాపాడి వారిముందే అదృశ్యమైనప్పుడు నేను సర్వత్రాఉన్నాను అని నిరూపించారు. సర్వత్రా వారిని దర్శించి తరించమంటున్నారు. అదేవిధంగా సర్వత్రా, సర్వదా, జీవనిర్జీవులలో తనను స్మరించి రాగ ద్వేషాలుమాని ప్రవర్తిస్తే దారం తెగిపోకుండా ఉంటుందని చెపుతున్నారు. నిరంతరం నీవు పీల్చే గాలి నేనే అని నాకు చెప్పినప్పుడు పంచభూతాలూ నేనేనని బోధిస్తున్నారు. ఈ ఎరుకగల్గి ఉండడమే దారం తెగిపోకుండా చూచుకోవడం.



## మంత్రమెక్కడుంది తంత్రమెక్కడుంది చూచుకుంటూ పొయ్యేదేగదయ్యా

మంత్రోపదేశం చేయమని అడిగిన భక్తులతో శ్రీ స్వామి వారు పైమాటలన్నారు.

శ్రీ స్వామివారిది శ్రీసాయినాథునివలె ప్రత్యేకమైన సాంప్రదాయం. చెవిలో ఉపదేశించడం ఉండదు. ఒక వేళ ఉపదేశించినా ఆ మంత్రాన్ని చక్కగా అనుష్ఠించి సిద్ధిపొందగల సంస్కారం కావాలి. అట్టి సంస్కారం వెయ్యికొక్కరికి కాదు కదా లక్షకొక్కరికి గూడ ఉండదేమో. చూచుకుంటూ పోవడమనేది ఉత్తమోత్తమ మార్గము. ఏమి చూచుకుంటూ పోవాలి? ఎలా, ఏ మార్గాన పోవాలి అనేది సాధకులమని భ్రమించే వారికి పెద్ద సమస్యే. శ్రీ స్వామివారు ఎలా జీవిస్తున్నారు. అది చూచి నేర్చుకొని ఆచరిస్తే తరించిపోతాము. జీవితమంతా పరోపకార చింతన తప్ప స్వార్థచింతన ఇసుమంత లేదు. కానీ మానవునకు స్వార్థచింతన తప్ప పరోపకారచింతన ఇసుమంత లేదు. ఆచార్య భరద్వాజ తండ్రిగారివలె భగవంతునిపై విశ్వాసముంచి మరుపూటకెట్లా, నా బిడ్డలకు నేనేమివ్వాలి అనే చింతనే లేదు. సవర బంగారం ఖరీదు ఇర్వై ఐదు రూపాయలుండే రోజులలో రోజుకు నాలుగువందల రూపాయలు హుండీలో వచ్చినా సాయంకాలమునకు అంతా తన్నాశ్రయించిన వారికిచ్చేవారు. ఆయుర్వేద వైద్యం చేస్తే ఎవ్వరి దగ్గరా డబ్బుతీసుకోరు. హుండీలో బుద్ధిపుట్టినంత వేయాలి. గనుకనే శ్రీ సాయినాథుడు వరసగా వారం రోజులు భౌతిక దర్శనమిచ్చారు. శిరిడీ వెళితే పాలరాతి విగ్రహానికి బదులు సజీవమూర్తి కొన్ని గంటలు దర్శనమైన ధన్యమూర్తి. భగవంతునిపై అలాంటి విశ్వాసముంచి జీవనము సాగించమన్నారు. రాజై ఉండి కూడా బిచ్చగాని దుస్తులు ధరించేవాడు గొప్పవాడంటే, వేషం కాదు. తన ఆర్జన అంతా

స్వార్థం కొరకు కాక భగవంతుని ప్రతిరూపాలైన జీవులకొరకు వినియోగించమని బోధించారు.

ఏఏ జీవి ఏమి తినాలో ఏమి అనుభవించాలో ముందే నిర్ణయించబడి భూమి మీద పుడుతారు. అంతకుమించి ఏమీ అనుభవించలేడు. ఆశతో సంపాదించినా ఇనుప పెట్టెలలోను, బ్యాంకులలోను స్థిరాస్తుల రూపాలలో ఉంటే వాటికి కాపలాగా ఉండవలసిందే. తన సంపాదన ఇతరజీవుల రూపంలోని భగవంతునకై వెచ్చిస్తే భగవంతుడు గొప్పగా తృప్తి చెంది ఆశీర్వదిస్తాడని శ్రీ స్వామి వారి ఆచరణ, చూచి నేర్చుకొని తరించమన్నారు. అంతటి విశ్వాసము, ఆచరణ ఉంటే సద్గురువే మనలను వెతుక్కుంటూ వస్తారని బోధిస్తున్నారు. తన గురువుకు ప్రతిరూపమైన అగ్నిని ఒక్క క్షణం ఏమారకుండా సేవించారు. ఈ విశ్వమంతా తన గురురూపమే గనుక అన్ని జీవులూ తన గురురూపంగా భావించి సేవించారు, సేవిస్తున్నారు. జీవుల గతచరిత్రనే చూడకుండా తన్నాశ్రయించిన ప్రతివారినీ ఆదుకుంటున్నారు. తనయందు విశ్వాసం గల్గి తన మార్గాన జీవిస్తారని చూస్తున్నారు. బొత్తిగా మనలో మార్పేలేకుండా వ్యాపార సరళిలో ప్రవర్తిస్తూ ఇది చేస్తే అది ఇస్తాననే మన నడవడిలో మార్పులేకుంటే పొయ్యేవాళ్ళను పోనిచ్చేదే గదయ్యా అన్నారు. ఇది నేటికీ అక్షరాల నిజమై ఉంది.

శ్రీ స్వామి వారు ఆచరణ ద్వారా నేర్పించిన మరొక గొప్పసత్యం - నాభినందతి నద్వేష్టి. జీవితకాలమంతటిలో ఫలానావారిలాంటి వారు, ఫలానా వారు మంచివారు ఫలానా వారు చెడ్డవారు అనే మాట ఏనాడూ అని ఎరుగరు. వారికి అందరూ దైవస్వరూపులే ప్రతివారినీ ఎంతో గౌరవంగా అయ్యా, అమ్మా అని పిలిచేవారు. ఏనాడూ ఏకవచన



సంభోదన చేసి ఎరుగురు. మానవులకు నిద్రలేచినది మొదలు రాత్రి పడుకున్నంత వరకు పరుల విమర్శతోనే సరిపోతుంది. ఇక దైవచింతనకు కాలమేది! అలా చేస్తుంటే మన పుణ్యం ఆ విమర్శించబడిన వారికి వారి పాపం మనకు సంక్రమిస్తుందంటారు, పెద్దలు. గనుక దీనిని చూచినేర్చుకోమంటున్నారు మంత్రమడిగిన భక్తులను.

## మందల కనుక్కుంటే మంగళవారం మంచిదిగదయ్యా

ఏదైనా ఒక పనిచేసేందుకు ఏడువారములలో ఏ వారం మంచిది స్వామి? అని అడిగిన వారితో పై మాట అన్నారు.

మందల కనుక్కోవడమంటే ఏమిటి? పని ఎలా చేయాలో తెలిసి చేయడమని అర్థం. Method of doing things. సర్వపనులూ భగవంతుని సేవలని హృదయపూర్వకంగా నమ్మిచేయడం. ఆశాపాశములకు రాగద్వేషములకు తావివ్వకుండా చేయడం. భగవంతుడే ఈ పాంచభౌతికమైన శరీరమిచ్చి అందు భగవంతుడే నివసిస్తూ ఈ బొమ్మను ఆడిస్తున్నాడు. నాశరీరము అనేందుకే వీలులేదు. నీ శరీరమైతే నీవు చెప్పినట్లు వినాలిగదా? వినదే. భగవంతుని చింతించమంటే ఆలోచనలు చేస్తుంది. వద్దన్నా రోగగ్రస్తమౌతుంది. మనమెంత వద్దని చెప్పినా, లక్షలమంది డాక్టర్లు ఆత్మీయులూ ప్రయత్నించినా బూడిదయ్యే సమయమొస్తే అయ్యే తీరుతుంది. కనుక ఈ శరీరం మనదని భ్రమిస్తున్నాం కానీ అది భగవంతునిదే. కనుక భగవంతుడు ఆదేశించిన నియమాలు, ధర్మసూత్రాలననుసరించి పనులు చేయడం చేతనైతే ఏ వారమైనా పరవాలేదని అర్థం. అన్ని వారాలలోకి మంగళవారం చాలా చెడ్డదని తలుస్తాము. పని చేసే విధం బాగా తెలిస్తే

మంగళవారమైనా మంచిదే అన్నారు. అందుకే పెద్దలు "మనోనిశ్చయం మాండవ్యం" అన్నారు. మాండవ్య మహర్షి సిద్ధాంతం ప్రకారం మన మనస్సు ఎప్పుడు పనిచేయాలంటుందో అదే మంచిరోజన్నారు. వ్యవసాయం ఇళ్ళు కట్టడం, పెండ్లిండ్లు చేయడం, వ్యాపారాలు చేయడం అన్నీ భగవంతుని సేవలని ఆ పనిని ధర్మబద్ధంగా చేయడమే భగవంతుని తృప్తి పరచగలదని, ఆశకులోనై అధర్మానికి పాల్పడితే ఎంతటి గొప్పముహూర్తములో మొదలు పెట్టినా ఆ పని చేసే పద్ధతి అధర్మంగా ఉంది కనుక అది భవిష్యత్తులో దెబ్బ తిని తీరుతుందని శ్రీ స్వామివారి ఆజ్ఞ. ధర్మబద్ధంగా పనిచేసే వారికి మంగళవారం చేసినా మంచిదేనని శ్రీ స్వామివారి ఆజ్ఞ.

## ఆకలై కొంగుపట్టేవారికి అన్నం పెట్టాలయ్యా ఆపదలోనున్న వారిని ఆదుకోవాలయ్యా

ఇది సర్వమానవజాతికి శ్రీ స్వామివారి ఆజ్ఞగా భావించి మనం సామాన్యంగా మన బంధువులకు, ఆత్మీయులకు, ధనవంతులైన వారికి మర్యాదకొరకు వాళ్ళు ఆకలిలేదు, వద్దు అంటున్నా కొద్దిగానన్నా తినమని బలవంతం చేస్తాము. కానీ నిజంగా ఆకలై వచ్చిన అన్నార్తులకు, బిచ్చగాళ్ళకు పిడికెడు మెతుకులు పెట్టి పంపేస్తాము. బద్ధకిస్తే అదీలేదు. ఋణానుబంధాన్ని గుర్తించి ఆదరించు ఏ ప్రాణినీ తరిమివేయవద్దు అన్న మాటను మరచిపోతాము. శ్రీ స్వామివారు చెప్పిన మాటలో రెండవభాగం - కొంగు పట్టిన వారికి - అంటే అర్థించినవారికి ప్రేమతో పెట్టమంటున్నారు. ఆ వచ్చిన ప్రాణి రూపంలో శ్రీ స్వామి వారే వచ్చి అర్థిస్తున్నారని గుర్తించు అంటున్నారు. భగవద్గీతలో ఆకలి రూపంలో నేనే ఉన్నానని భగవంతుడు చెప్పిన మాటను మరువరాదు. దేవాలయాల దగ్గర డబ్బా తీసుకొని పైసలు అడుక్కునేవారికంటే ఆకలైనవారు



అడిగినప్పుడు బీదవాడా, ధనవంతుడా అని చూడకుండా ఆకలి తీర్చమంటున్నారు. డబ్బులిస్తే దుర్వినియోగమయ్యే ప్రమాదముంది. అన్నమే పెట్టించు. మరొక పదార్థంతో ఆకలి తీర్చాలిగాని డబ్బులు ఇస్తే దుర్వినియోగమవవచ్చు. మనుషులేకాదు ఏ ప్రాణైనా ఆకలైనప్పుడు మనదగ్గరకొచ్చినప్పుడు ఆ ప్రాణి యొక్క ఆకలి రూపంలో భగవంతుడే ఉన్నాడని సంతృప్తి చేయమంటున్నారు. వెంటనే మరొక ప్రశ్న వేయడం కూడా ఉంది. మనం పెడుతున్నామని నిత్యం వస్తుంటే ఏంచేయాలి అంటారు. వారి పరిస్థితి కనుక్కొని ఆ కష్ట పరిస్థితిని తొలగించే ప్రయత్నం చిత్తశుద్ధితో చేయడం మనకర్తవ్యం. ఏ పనీ చేయలేని వారైతే మదర్‌థెరెసా ఆశ్రమంలాంటి చోట చేర్చడం, పని చేయగలిగితే పని చూపించి అన్నం వచ్చే ఏర్పాటు చేయడం.

ఆపదలోనున్న వారిని ఆదుకోవడం కూడా ఇలానే చేయమంటారు శ్రీ స్వామివారు. మనం ఆదుకోలేకుంటే ఆదుకునే వారిని చూపించడం మనధర్మం. ఇలా చేస్తుంటే శ్రీ స్వామివారి కృప కల్గుతుందంటారు. యత్‌భావం తద్‌భవతి అన్నారు కదా.

## సత్యం, ధర్మం

వీటిని తప్పిన వారంతా చేతికి చిక్కిన మాణిక్యమును దక్కించుకోలేని దౌర్భాగ్యులయ్యారు. శ్రీ స్వామివారి దివ్య సన్నిధికి దూరమయ్యారు. అలా శ్రీ స్వామివారికి దూరమైన వారు కొందరు దివంగతులైనారు. మరికొందరు శ్రీ స్వామివారు ఉండగనే వారి సన్నిధి వదలి వెళ్ళిపోయారు.

మరి సత్యం, ధర్మం తప్పని శ్రీ రోశిరెడ్డి వంటి మహా భక్తులు ఒక్కొక్కప్పుడు సాటిసేవకుల పరిహాసాలు, నిందలు, దూషణలు ఓర్చుకోలేక శ్రీ స్వామివారిని వదలి వెళ్ళిపోవాలని చూస్తేగూడ సర్వజ్ఞులైన శ్రీ స్వామివారు వారిని తనకు దూరం కానివ్వలేదు. "అయ్యా ఎవరో ఏమో అన్నారని వెళ్ళిపోవాలంటావా. పంటచేను వదలి పరిగ ఏరుకుంటావా. ఊర్లో అన్ని నూకలు అడుక్కుని జావకాచుకుని త్రాగి ఇక్కడ ఉండయ్యా" అని చెప్పి వెళ్ళేవారిని ఆపి తన దివ్యసన్నిధి ప్రసాదించారు. చివరిదశలో ఎవరిసేవనూ తీసుకోకుండా పూర్తిప్రజ్ఞతో తనువుచాలించేటట్లు చేశారు. మరి తక్కిన వారిని పొయ్యేవాళ్ళను పోనిచ్చేదేగదయ్యా అన్నారు. సత్యం, ధర్మం తప్పిన వాళ్ళకు శ్రీ స్వామివారు కొన్ని హెచ్చరికలు చేసి వదిలేస్తారని అర్థం.

జిహ్వారుచికొరకు ఇతరులవద్ద తిని మొహమాటపడి తమ ధర్మం తప్పిన వారు కొందరు. సంఘం దృష్టిలో గొప్పవారుగా ఉండాలని సేవకా ధర్మమే మరచి అహంకరించినవారు కొందరు. ధనాశకులోనై శ్రీ స్వామివారు సర్వజ్ఞులని మరచి మనమాటలను, చేతలను, ఆలోచనలు అనుక్షణం సాక్షిగా గమనిస్తూ తగు ఫలితాలిస్తారనే సత్యం మరచినవారు కొందరు శ్రీ స్వామివారికి దూరమయ్యారు.

రోశిరెడ్డి శ్రీస్వామివారి ఆజ్ఞలను కఠోర దీక్షతో ప్రాణానికి తెగించి ఆచరించేవారు. అందుకే వారిని "నీది భీష్ముని పట్టుదలయ్యా" అని వ్రాయించారు.

ఇతరుల మొహమాటాలకు, వత్తిళ్ళకు లొంగి శ్రీ స్వామివారిని తాకి నమస్కరించుకోనిచ్చేవారు కాదు. శ్రీ స్వామివారిని ఇతరులు తాకకుండా కాపలా ఉండే తనధర్మాన్ని అంతచక్కగా ఆచరించి శ్రీ స్వామి



వారి సంపూర్ణ కృప పొందిన భాగ్యశాలి అయ్యాడు. మనలను కూడా వారి ఆచరణ చూచి నేర్చుకోమన్నారు.

## సంపన్నత్వం - సాధారణత్వం

సంపన్నత్వమంటే లౌకికమైన సంపదగలవారు మరియు ఆధ్యాత్మిక సంపదగలవారని కూడా అర్థము. సంపన్నత్వము కలవారు తప్పక సాధారణత్వం కల్గి వినమ్రులై భగవంతునకు కృతజ్ఞులై ఉండాలంటారు శ్రీ స్వామివారు. నేను సంపదనార్జించి శ్రీ స్వామివారికి దానం చేసిన దాతను. కనుక నాకు ప్రత్యేక దర్శనము, ప్రత్యేక మర్యాదలు కావాలని మనసులో కూడా కోరరాదు. అలాంటి ప్రత్యేకతలు సంస్థానం వారు ఇచ్చినా స్వీకరించరాదని శ్రీమాన్ బూటీ మహాశయుని చివరి సందేశమేగాక పూజ్యపాదులు ఆచార్య భరద్వాజ మాష్టరు గారి సలహా మరియు ఆచరణ మాత్రమేగాక, శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ గారు మానవాళికి ఒసంగిన దివ్య సందేశమదే. శ్రీ స్వామివారు సర్వసాక్షి కనుక మనం సమర్పించినది వారికి తెలుసు. మరి మనమిపుడు ప్రత్యేక మర్యాదలు, ప్రత్యేక దర్శనాలు కోరుతున్నామంటే, మనం కైంకర్యము చేసిన దానికి బదులు ఈ ప్రత్యేక దర్శనాలు, మర్యాదలు కొంటున్నామని భావం. వజ్రాలనిచ్చి గాజు పెంకులు కొనే ప్రబుద్ధులమవ్వాలని తలచవచ్చా? సంస్థానం వారు కళ్ళు తెరచి ఇలాంటి అమాయకులకు నిజరహస్యం బోధించేటట్లు చేయమని శ్రీ స్వామివారిని ప్రార్థిద్దాం. శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ ఎవరో ఏమి చెప్పారో తెలుసుకోవాలనే సత్పురుషులు శ్రీ జ్ఞానేశ్వర్ భగవద్గీత అనే పేరుతో అన్ని 'వెంకట్రామ అండ్ కో' లలో దొరుకు గ్రంథం చదవండి. అందులో ఈ విషయం 16వ అధ్యాయం 4వ శ్లోకంలో వివరించారు.

మొదట వివరించిన ఆరు సన్నివేశాలలోను సంస్థానం వారి అవసరాన్ని గుర్తించిన శ్రీ స్వామివారు ఆయా సందర్భాలలో ఆదుకొన్నారు గదా! ఆయాదాతలు మేము శ్రీ స్వామికి దానము చేశాము కనుక మాకు ప్రత్యేక మర్యాదలు, దర్శనాలు కావాలనుకోవడం ఎంత సమంజసమో యోచించండి. ఒకవేళ వారుకోరినా సంస్థానం వారు వారికి తెలియచెప్పే బదులు వారికా ప్రత్యేక మర్యాదలు చేసి వారి పుణ్యం హరించడం ఎంత శోచనీయమోగదా!

## శ్రీ స్వామి వారి ప్రత్యేకతలు:

1. తాను ఏ భక్తుని ఎలా ఆశీర్వదించినా ఎవరికి ఏమి చెప్పదలచినా కాగితం మీద వ్రాయించి ఇచ్చేవారు. ఈ విధంగా వ్రాయించి ఇచ్చిన మహనీయులెవ్వరూ ఇంతవరకు మనం చూడలేదు.

2. చివరి రోజులలో సంపన్నత్వం, సాధారణత్వం, సత్యం, ధర్మం, సద్గురు సేవ అని సర్వశాస్త్రాల సారమైన తన ఆదేశాన్ని మానవాళికంతయూ పనికొచ్చే పంచసూత్రాలు ఏ మహనీయుడూ చెప్పియుండలేదు. ఇతర మహత్ములు సందర్భోచితముగా భక్తులతో చెప్పిన మాటలను గ్రంధకర్తలు వారి సూక్తులుగా చెప్పారుగానీ శ్రీ స్వామి వారి వలె తమ చరమోపదేశం బోధించలేదు.

3. తాను నడిచినన్ని రోజులు ఒక్క క్షణం ఏమారకుండా గురురూపమైన అగ్నిని రాత్రింబవళ్ళు తన చెంతనుంచుకున్నారు. కపిలమోకు ముక్కలను నిప్పంటించి నడిచేటప్పుడు తన వెంట తీసుకవెళ్ళేవారు.



4. సమాధి చెందే వరకు తనగుట్టు వెళ్ళడి కాకుండా తిరువళ్ళూరు వీరరాఘవస్వామి, నెల్లూరు రంగనాయకులు మొదలగు దేవతలకు మొక్కుబడి చెప్పి టెంకాయ కొడితే బాగుచేస్తారని చెప్పేవారు. తన మహిమ అనుభవించిన వారు కూడా ప్రక్కవారికి చెప్పకుండా తన యోగశక్తిచే వారించేవారు. చివరివరకు పిచ్చి వెంకయ్యగానే ఉన్నారు. ఒక్క ప్రశంశగానీ, ఒక్క పువ్వుగానీ అంగీకరించలేదు.

5. నడచినన్ని రోజులు ఒక్క ఇంటి దగ్గరే భిక్ష స్వీకరించారు.

6. తరించే మార్గం చెప్పమంటే చూచి నేర్చుకోమన్నారు.

**మంగళహారతి :-**

మంగళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే।
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళం॥
మంగళం వేద వేద్యాయ మేఘశ్యామలా మూర్తయే।
పుసాం మోహన రూపాయ పుణ్య శ్లోకాయ మంగళం॥
రామచంద్రాయ మంగళం రామ క్రిష్ణాయ మంగళం।
గురుదేవాయ మంగళం సద్గురు దేవాయమంగళం।

స్వామి వెంకయార్యాయ గొలగమూడి వాసాయ
మామకా భీష్టదాయ మహిత మంగళం॥
లోక నాథాయ భక్తలోక సంరక్షకాయ
నాగలోక స్తుత్యాయ సవ్య మంగళం ॥స్వామి॥
భక్త బృందవందితాయ బ్రహ్మస్వరూపాయ
ముక్తిమార్గ బోధకాయ పూజ్య మంగళం ॥స్వామి॥
సత్యతత్వ బోధకాయ సాధువేషాయతే
నిత్య మంగళ దాయ కాయ నిత్య మంగళం ॥స్వా॥